సాక్షి మంచిర్యాల

శుక్రవారం ¦ 29 ¦ మార్చి ¦ 2024



మున్సిఫ్ కోర్టుకు వందేళ్లు

లక్సెట్టిపేటలోని మున్సిఫ్ కోర్టు శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఇప్పటికే ప్రతీ శనివారం సీనియర్ న్యాయవాదులు న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 10లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:30	శని: 4:50

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.0 /26.0

ఆకాశం ఉదయం ప్రకాశవంతంగా.. రాత్రివేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూములపై సర్వే

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రం మంచిర్యాల బస్టాండ్ వెనుకాల ఉన్న ప్రభుత్వ భూములను ల్యాండ్ సర్వే, రెవెన్యూ విభాగం ఉన్నతాధికారులు గురువారం సర్వే చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ బస్టాండ్ పరిసర ప్రాంతంలో భూములు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు రావడంతో సర్వే చేసినట్లు తెలిపారు. మంచిర్యాల శివారు సర్వే నంబర్ 422, గర్మిళ్ల శివారులోని 92, 93 ప్రభుత్వ భూములను జీపీఆర్ఎస్ ట్రాకర్ ద్వారా సర్వే చేపట్టామని తెలిపారు. పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. కాగా, సర్కారు భూములు కబ్జాకు గురవుతున్నాయని, స్థానిక సర్వే, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, తప్పుడు రిపోర్టులు ఇచ్చారని, బీజేపీ నాయకులు తులా మధుసూదన్‌రావు లోకాయుక్త, విజిలెన్స్, సర్వేశాఖకు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించి సర్వే చేపట్టారు. ఈ సర్వేలో హైదరాబాద్‌కు చెందిన రాష్ట్ర డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, సర్వేయర్ సంధ్య, జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, తహసీల్దార్ రమేష్, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 37మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 99.61శాతం విద్యార్థులు హాజరయ్యారు. 52 కేంద్రాల్లో పరీక్షలకు 9,442మంది విద్యార్థులకు గాను 9,405 మంది హాజరు కాగా, 37మంది గైర్హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 9,298మందికి గాను 9,276 మంది హాజరు కాగా 22మంది గైర్హాజరయ్యారు. గతంలో ఫెయిలైన విద్యార్థులు 144మందికి గాను 129మంది హాజరు కాగా 15మంది రాలేదు. రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా విద్యాధికారి యాదయ్య మూడు కేంద్రాలను పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 13 పరీక్ష కేంద్రాలు పరిశీలించినట్లు కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దామోదర్‌రావు తెలిపారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



డీఈవో యాదయ్యతో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం జిల్లా సైన్స్ సెంటర్‌లో వైజ్ఞానిక సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్ పోటీల్లో జిల్లాస్థాయి విజేతలకు మెమెంటో, ప్రశంసపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శనలు అనేక సమస్యలకు పరిష్కారాలు చూపే ఆవిష్కరణలకు దోహదం చేస్తాయన్నారు. ప్రతీ విద్యార్థి సైన్స్ ప్రదర్శనల్లో పాల్గొని తమ ఆలోచనలతో సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే నూతన ఆవిష్కరణలు రూపొందించాలని తెలిపారు. అంతకుముందు రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు తిలకించారు. ప్రాజెక్టు పని విధానం, ఉపయోగాలు తెలుసుకున్నారు. ఆర్ఎస్‌బీవీపీలో విజేతలుగా నిలిచిన 12మంది, ఇన్‌స్పైర్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన 10 మందికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రతీ మండలంలో కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కిరణ్

మంచిర్యాలఅర్బన్: నూతనంగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా నాలుగో మహాసభలు మంచిర్యాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నూతన ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలో ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంపు ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయని అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు, ఇతర బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, తిరుపతి, జిల్లా మాజీ కార్యదర్శి కుమార్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు ఆశయ్య, రైతు సంఘం అధ్యక్షుడు రవి, జిల్లా కమిటీ సభ్యులు అభినవ్ పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగిరేనా?



- పెద్దపల్లి 'ఎంపీ' స్థానంపై బీజేపీ గురి
- గెలుపు కోసం చెమటోడుస్తున్న వైనం
- పార్టీకి కేడర్ లేమి, నాయకత్వ లోపం
- ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకోవాలని 'కమలం' పార్టీ నేతలు చెమటోడుస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల చరిత్రలో బీజేపీ నుంచి ఎంపీగా ఎవరూ గెలువలేదు. దీంతో ఈసారి ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1998, 1999 సాధారణ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ పొత్తులో ఎన్డీఏ అభ్యర్థిగా సుగుణకుమారి ఎంపీగా విజయం సాధించారు. ఆ తర్వాత 2019లోనే తొలిసారిగా బీజేపీ నుంచి అభ్యర్థిని ఎన్నికల్లో దింపింది. సోగాల కుమార్‌ను బరిలో నిలుపగా.. ఆయన 92,606 ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. మళ్లీ రెండోసారి ఆ పార్టీ అభ్యర్థిగా ఈ ఎన్నికల్లో గోమాసే శ్రీనివాస్‌ను ఎంపిక చేయడంతో ప్రచారం ప్రారంభించారు.

క్షేత్రస్థాయిలో నాయకత్వ లేమి

బీజేపీలో నియోజకవర్గ, మండల, గ్రామీణ స్థాయిలో బలమైన కేడర్ నిర్మాణం కాకపోవడమే ప్రధాన లోపంగా మారింది. కేంద్రంలోని ప్రధాని మోదీ చరిష్మా తప్పితే స్థానిక నాయకులకు ప్రజాబలం లేకపోవడం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇక ప్రతీ ఎన్నికల్లోనూ పోటీ నిలిపేందుకు అభ్యర్థులను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఎవరైనా పెద్ద నాయకులు చేరితే ఉంటారో పార్టీ వీడుతారో తెలియడం లేదు. గడ్డం వివేక్ బీజేపీలో ఉన్నంత కాలం పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో సత్తా చాటుతామని ఆశపడ్డారు. తీరా ఎన్నికల వేళ ఆయన కండువా మార్చడంతో కాషాయ కేడర్ డీలా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల స్థానం తప్పితే ఎక్కడా డిపాజిట్లు రాలేదు. అంకితభావంతో పని చేసే కార్యకర్తలు ఉన్నా, కానీ సరైన నాయకత్వం లేక ఎదగలేకపోతోంది. ప్రస్తుతం పార్టీలో పడి ఉన్నవారికి కాకుండా కాంగ్రెస్ నుంచి వచ్చిన 'గోమాసే'కు టికెట్ ఇవ్వడం కొందరు నాయకులకు మింగుడు పడడం లేదు. జిల్లా కేంద్రంతోపాటు బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో అసంతృప్తితోనే ఉన్నారు.

కాంగ్రెస్‌తో పోటీపడాలని..

గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన 'హస్తం' పార్టీకి బీజేపీ ప్రధాన పోటీదారుగా నిలవాలని ఆరాటపడుతోంది. అప్పటి దాకా బలంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవంతో ఇబ్బందుల్లో పడి క్రమంగా ప్రభావం కోల్పోతోంది. ఈ తరుణంలో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు బీజేపీ నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. 2019నుంచి పెద్దపల్లి పరిధిలో తమ పార్టీకి ఆదరణ మొదలైందని కాషాయ మద్దతుదారులు చెబుతున్నా, ఆ మేరకు పార్టీ నిర్మాణం కాలేకపోయింది. గత ఐదేళ్లలో బీజేపీ పుంజుకోకపోగా, కాంగ్రెస్ బలపడింది. దీంతో 'కమలం' పార్టీకి స్థిరత్వం రాక, ఇంకా కష్టాలే వెంటాడుతున్నాయి.

సత్తా చాటేనా?

దేశంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీజేపీ అని చెబుతూ కార్యకర్తలు నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గానికి ఒకరిని ఇన్చార్జీలుగా నియమించి ఢిల్లీ నుంచి పర్యవేక్షణలు జరుగుతున్నాయి. గత ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్ గెలిచినట్లుగానే ఈసారి పెద్దపల్లి ఎంపీ సీటు గెలుస్తామనే నమ్మకంతో ఉన్నారు. అలాగే హిందుత్వ, యువత, 'గడ్డం' ఫ్యామిలీ, బీఆర్ఎస్ పార్టీపై ఉన్న వ్యతిరేకత తమకు కలిసొస్తాయనే ధీమాలో ఉన్నారు. ఈ క్రమంలో బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతుందా? లేదా అనేది ఫలితాలే తేల్చనున్నాయి.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్



5కే రన్‌లో పాల్గొన్న ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేసే సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు చేపట్టిన 5కే రన్‌ను జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, డీసీపీ అశోక్‌కుమార్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా కళాజాత, ఇంటింటికి తిరుగుతూ వివిధ రకాల ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలో సిబ్బందితో కలిసి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ప్రోత్సహించాలని అన్నారు. వాక్ టు పోలింగ్ బూత్, ఓటు వినియోగం, ప్రాముఖ్యత తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. 2024 ఏప్రిల్ ఒకటిని ప్రామాణికంగా తీసుకొని 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 15లోగా తమ వివరాలు నమోదు చేసుకుని నూతన ఓటు కార్డు పొందాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే టోల్‌ఫ్రీ నం.1950, సీ–విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. అనంతరం అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, యువతీ, యువకులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్‌లోకి అల్లోల, గడ్డం..!?

- కేకేతో కలిసి వెళ్లే అవకాశం..!
- హైదరాబాద్‌లో చర్చించిన సీనియర్లు

నిర్మల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇద్దరు బీఆర్ఎస్ సీనియర్ నేతలు కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటికే తనవంతు ప్రయత్నాలు కొనసాగిస్తుండగా.. మరోవైపు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరిద్దరూ హైదరాబాదులో బీఆర్ఎస్ సీనియర్ నేత కే.కేశవరావును గురువారం కలిశారు.

కేకేను కలిసిన సీనియర్లు..

భారత రాష్ట్ర సమితిలో నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమైన కే.కేశవరావు(కేకే) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కలిశారు. ఈ సమావేశం నుంచి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో కేకేను ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, గడ్డం అరవింద్‌రెడ్డి కలిశారు. ఈ నేతలిద్దరూ కొన్ని రోజులుగా హస్తం పార్టీలో చేరేందుకు ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 30న కేశవరావు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇదే క్రమంలో ఆయన వెంట సీనియర్ నేతలు ఇద్దరూ హస్తం కండువా కప్పుకుంటారని ప్రచారం జరుగుతోంది. సీనియర్ నేత కేశవరావుకు నిర్మల్ జిల్లాతో గత అనుబంధం ఉంది. ఈ క్రమంలో కేకేతో కలిసి సీనియర్లు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

నిర్ణయం తీసుకోలేదు : 'అల్లోల'

కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారంటూ తనపై కొంత కాలంగా నడుస్తున్న ప్రచారాన్ని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఖండించారు. తాను కాంగ్రెస్‌లో చేరే విషయం ఇంకా ఫైనల్ కాలేదని, పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకోలేదని 'సాక్షి'కి తెలిపారు. కేసీఆర్‌ను కలిసి వచ్చినందునే కేకేతో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారం సకాలంలో అందించాలి

లక్సెట్టిపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, దివ్యాంగులకు ప్రతీరోజు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా ప్రతీ ఒక్కరికి అన్నీ అందిస్తున్నామని తెలిపారు. కార్యకర్తలు, టీచర్లు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని అన్నారు. ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రేష్మ, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకం



రన్‌లో పాల్గొన్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు ఎంతో కీలకమైందని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎన్నికల్లో స్వేచ్ఛగా, నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గురువారం ఓటర్లకు అవగాహన కోసం బెల్లంపల్లిలోని సింగరేణి తిలక్ స్టేడియం నుంచి ఏఎంసీ మైదానం వరకు నిర్వహించిన 5కే రన్‌ను ఆర్డీవో జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్, బజార్ ఏరియా, కాంటా చౌరస్తా మీదుగా సాగిన రన్‌లో అధికారులు, స్థానికులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఓటు హక్కు ప్రాముఖ్యత ప్రతిజ్ఞ చేశారు. రన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.వై.ప్రసాద్, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో మహేందర్, సీడీపీవో ఉమాదేవి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఐనాల సైదులు, ఊటూరి సంతోష్, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

వంద శాతం వసూలయ్యేనా..!

- పంచాయతీల్లో 85శాతం వరకు పన్ను వసూళ్లు
- ప్రథమ స్థానంలో కన్నెపల్లి.. చివరన తాండూర్
- కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్
- రాష్ట్రంలో పదో స్థానంలోపు జిల్లా



హాజీపూర్‌లో పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో ఇంటి పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు పంచాయతీ అధికారుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ఇప్పటివరకు 85శాతం వరకు పన్నులు వసూలు కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మూడు రోజులే మిగిలి ఉంది. వంద శాతానికి చేరాలంటే ఈ మూడు రోజుల్లో 15శాతం పన్నుల వసూలు సాధ్యమేనా అనే సందేహం వ్యక్తమవుతోంది. పన్నుల వసూళ్లలో జిల్లా ప్రస్తుతం రాష్ట్రంలో పదో స్థానంలోపు ఉండగా మొదటి స్థానం సాధించేందుకు అధికార యంత్రాంగం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇంటి పన్నులు, వాణిజ్య పన్నులు, మంచినీటి నల్లాబిల్లుల వసూలు వంద శాతం సాధించాలని ఉన్నతాధికారులు సూచిస్తుండడంతో గ్రామాల్లో నిరంతరాయంగా స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నారు. జిల్లాలో 311 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, ఇతర పన్నుల ద్వారా రూ.7,56,67,000 వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు రూ.6,21,26,000 వసూలయ్యాయి. ఇంకా రూ.1,40,99,000 వసూలు చేయాల్సి ఉంది.

కన్నెపల్లి మొదటిస్థానం..

వంద శాతం పన్నులు వసూలు చేసి జిల్లాను అగ్రభాగాన నిలపాలన్న ఉన్నతాధికారుల సూచన మేరకు డీపీవో ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు(ఎంపీఓ), ఎంపీడీవోలతో ప్రత్యేకంగా సమావేశమై పన్నుల వసూళ్ల వేగం పెంచారు. జిల్లాలోని 16 మండలాల్లో కన్నెపల్లి మండలం 98.77శాతం పన్నుల వసూలుతో మొదటి స్థానంలో ఉండగా, తాండూర్ మండలం 75.69శాతంతో పన్నుల వసూలు చేసి చివరి స్థానంలో ఉంది. భీమిని మండలం 91.28శాతం, లక్సెట్టిపేట 87.87శాతం, కాసిపేట 86.11శాతం, మందమర్రి 82.18శాతం, చెన్నూర్ 78.70శాతం, నెన్నెల 81.59శాతం, భీమారం 88.94శాతం, దండేపల్లి 74.88శాతం, వేమనపల్లి 83.14శాతం, హాజీపూర్ 84.30శాతం, బెల్లంపల్లి 84.47శాతం, కోటపల్లి 77.98శాతం, జైపూర్ 85.57శాతం, జన్నారం 81.93 శాతం పన్నులు వసూలు చేశాయి.

లక్ష్యం చేరుకునేలా..



జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పన్నులు వంద శాతం వసూళ్లను చేరుకునేలా చూస్తున్నాం. ఇప్పటికే 85 శాతానికి పైగా పన్నులు వసూలు కాగా మిగతా 15శాతం వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటాం. వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ఈ మూడు రోజుల్లో దాదాపు లక్ష్యాన్ని చేరుకుంటాం. తక్కువ శాతం వసూలైన గ్రామాలను గుర్తించి వేగవంతం చేస్తాం.

– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్



బండవరం జగన్



కిరణ్‌కుమార్



మనోహర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బండవరం జగన్ అలియాస్ జగ్గయ్య విజయం సాధించారు. గురువారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఎన్నికల కమిషనర్ ఎస్.కమల్‌మనోహర్‌రావు, సహాయ ఎన్నికల కమిషనర్ జి.మహేందర్ పర్యవేక్షణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. జగన్‌కు 110 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి కొత్త సత్తయ్యకు 86 ఓట్లు వచ్చాయి. జగన్ 24 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా కె.గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.మురళీక్రిష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎం.కనకయ్య, కోశాధికారిగా అల్లెం శ్రీనివాస్, లైబ్రరీ కార్యదర్శిగా సాగె గురువయ్య, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎస్.సంతోశ్‌గౌడ్ గెలుపొందారు. అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా ఎస్.రాధిక ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అసోసియేషన్ ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా సోమ ప్రదీప్‌చంద్ర, పెసర శ్రీకాంత్, సుంకు లక్ష్మీనారాయణ, దుర్గం రమేశ్, ఉమారాణి విజయం సాధించారు.

లక్సెట్టిపేట అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గోవిందరావు తెలిపారు. అధ్యక్షుడిగా గడికొప్పుల కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గాండ్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల రాజేశ్వర్, జాయింట్ సెక్రెటరీగా వొజ్జల నళినికాంత్, కోషాధికారిగా ఎండీ.అబ్జల్ బియ్యాబాని, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా నాయిని సత్యగౌడ్, లైబ్రెరియన్ కార్యదర్శిగా ఎండీ షఫీక్, మహిళా కార్యదర్శిగా జి.పద్మ, కార్యనిర్వాహక సభ్యులుగా కొమిరెడ్డి సత్తన్న, వేల్పుల సత్యం, సుమన్ చక్రవర్తి, రెడ్డిమల్ల ప్రకాశంల ఎన్నికయ్యారు.

బెల్లంపల్లి అధ్యక్షుడిగా మనోహర్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిప్ప మనోహర్ ఎన్నికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా కనుకుంట్ల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా సింగతి రాజేష్, సంయుక్త కార్యదర్శిగా దాసారపు రాజు, కోశాధికారిగా సునిల్ థామస్‌లను ఎన్నుకున్నారు. మనోహర్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది మూడోసారి.

సెలవు రోజుల్లోనూ సంతకాలు

- మున్సిపల్ మేనేజర్ నిర్వాకం
- ఉద్యోగుల హాజరుపై పర్యవేక్షణ కరువు



హాజరు రిజిష్టర్‌లో సంతకం చేసిన మేనేజర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీలో విధులు నిర్వర్తిస్తున్న ఓ అధికారి సెలవు రోజుల్లోనూ హాజరు రిజిష్టర్‌లో సంతకాలు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పర్యవేక్షణ కరువైంది. మున్సిపల్ మేనేజర్ గత కొన్ని నెలల నుంచి విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదనే ఆరోపణలున్నాయి. సెలవులో ఉన్న రోజుల్లోనూ మరుసటి రోజు రిజిష్టర్‌లో సంతకాలు చేయడం పరిపాటిగా మారింది. గత నాలుగైదు నెలల్లో సదరు అధికారి పలుమార్లు సెలవు పెట్టారు. కానీ ఆ రోజుల్లో హాజరు రిజిష్టర్‌లో సంతకాలు చేసినట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది. ఫిబ్రవరిలో 17, 28న అధికారికంగా సెలవు పెట్టి మరుసటి రోజు విధులకు హాజరైన తర్వాత ఆ రెండ్రోజులూ రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణపై మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కిందిస్థాయి సిబ్బంది చేసిన చిన్న తప్పిదాలకు మెమోలు ఇస్తున్న అధికారులు మేనేజర్ నిర్వాకంపై మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావొద్దు



భీమారంలో పాల్గొన్న ఏసీపీ వెంకటేశ్వర్లు

భీమారం: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. భీమారం పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మండల కేంద్రంలో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతియుత వాతావరణం కల్పించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని, ప్రజలు సహకరించాలని అన్నారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్, భీమారం, జైపూర్, శ్రీరాంపూర్ ఎస్సైలు రాములు, శ్రీధర్, సంతోష్, సాయుధ పోలీసులు పాల్గొన్నారు.

ఇందారంలో ఫ్లాగ్‌మార్చ్

జైపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఇందారం గ్రామంలో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పోలీస్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి కవాతులో ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్సైలు శ్రీధర్, సంతోశ్, రాములు, అదనపు ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

మందమర్రిరూరల్: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. గురువారం మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులతో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కర్ణమామిడి శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,600 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత



తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని అచలాపూర్ గ్రామానికి ఉపాధి నిమిత్తం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన రాజేశ్‌కుమార్ కుమారుడు సుశాంత్ కుమార్ (2) గురువారం తప్పిపోయాడు. తల్లిదండ్రులు 100కు ఫోన్‌చేయగా స్పందించిన తాండూర్ పోలీసులు అచలాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారి వెంట వెతికారు. బాలుడు గ్రామ శివారులో నడుచుకుంటూ వెళ్తుండగా పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులను పలువురు అభినందించారు.

ఆర్థో జాయింట్ ఆయిల్ సీజ్



సీజ్ చేస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: పక్షవాతం, రుమటాయిడ్, ఆర్థరైటిస్ వంటి వ్యాధులు తగ్గిస్తుందంటూ మోసపూరిత ప్రకటనలు చేస్తూ విక్రయిస్తున్న ఆర్థోజాయింట్ ఆయిల్‌ను సీజ్ చేసినట్లు డ్రగ్స్ అధికారులు తెలిపారు. కరీంనగర్ నుంచి ఏడీ ఎం.శ్రీనివాసులు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ టి.చందనలు గురువారం జిల్లా కేంద్రంలోని పలు ఆయుర్వేద షాపులలో తనిఖీలు నిర్వహించారు. అమ్మకానికి ఉంచిన ఆర్థోజాయింట్ ఆయిల్‌ను సీజ్ చేయడంతో పాటు, ఆ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

జైనూర్(ఆసిఫాబాద్): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. గురువారం మండలంలోని జంగాం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ముగ్గురు వాహనదారుల నుంచి రూ.1.31 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మున్సిఫ్ కోర్టుకు వందేళ్లు



నిజాం కాలంలో నిర్మించిన మున్సిఫ్ కోర్టు భవనం

- నిజాం కాలంలో కోర్టు భవన నిర్మాణం
- శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబు

లక్సెట్టిపేట(మంచిర్యాల): నిజాం పాలనకు నిలువుటద్దంగా నిలుస్తున్న మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు వంద సంవత్సరాల్లోకి అడుగుపెట్టింది. నిజాం ప్రభువులు ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, నిర్మల్, లక్సెట్టిపేట, చెన్నూర్, ఆసిఫాబాద్ తాలూకా కేంద్రాల్లో కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రతీకోర్టులో ఉర్దు భాషలో శిలాఫలకం రాసి ఉంటుంది. లక్సెట్టిపేటలో నిర్మించిన మున్సిఫ్ కోర్టు భవనాన్ని 1924, నవంబర్ 5న అప్పటి జడ్జి మౌలాలి సయ్యద్ యూసుఫ్ అలీ ప్రారంభించారు. నిజాం కాలంలో నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులు చేయించి సబ్‌జైల్‌కు కేటాయించారు. భవనాన్ని ప్రస్తుతం అండర్ ట్రయల్ ఖైదీలకోసం వినియోగిస్తున్నారు. మున్సిఫ్ కోర్టు పక్కనే స్థలం కేటాయించి పక్కా భవనం నిర్మించారు. 1985 ఫిబ్రవరి 3న అప్పటి జిల్లా జడ్జి కె.బి సిద్దప్ప, మున్సిఫ్ కోర్టు జడ్జి అహ్మద్ జియాస్‌ఖాన్ కోర్టు భవనాన్ని ప్రారంభించారు. నిజాం కాలం నాటి మున్సిఫ్ కోర్టుకు వందేళ్లు పూర్తి కావడంతో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు

మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు భవనం నిర్మించి వందేళ్లు కావస్తున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ కోర్టు ఆవరణను శుభ్రం చేయిస్తున్నారు. ముస్తాబు చేయిస్తున్నారు. వేడుకల్లో భాగంగా ప్రతీ శనివారం జడ్జీలు, సీనియర్ న్యాయవాదులు చట్టాలపై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేడుకలు ఘనంగా నిర్వహించాలని పట్టణవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి



1977లో హైదరాబాద్‌లో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి ఇక్కడి కోర్టులోనే న్యాయవాదిగా విధులు నిర్వర్తించా. కోర్టు ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తి అయ్యింది. ఇక్కడి కోర్టులో చాలా కేసులు పరిష్కారమయ్యాయి. శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి.

– చేరగుడి ప్రభాకర్, సీనియర్ న్యాయవాది, లక్సెట్టిపేట

ఏర్పాట్లు చేస్తున్నాం



మున్సిఫ్ కోర్టుకు వందేళ్ల చరిత్ర ఉంది. శతాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం రినోవేషన్ వర్క్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వేడుకలు ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్ అసదుల్లా షరీఫ్, జూనియర్ సివిల్ జడ్జి, లక్సెట్టిపేట

'కవ్వాల్'లో ట్రైయినీ బీట్ అధికారులు



డాగ్ స్క్వాడ్ గురించి తెలుసుకుంటున్న ట్రైయినీ బీట్ అధికారులు

- శిక్షణలో భాగంగా మూడు రోజులపాటు పర్యటన
- డివిజన్‌లోని పలు విషయాలు వివరించిన అధికారులు

జన్నారం(ఖానాపూర్): దూలపెల్లి ఫారెస్ట్ అకాడమీకి చెందిన 34 వ బ్యాచ్ శిక్షణ బీట్ అధికారులు 49 మంది కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట్ అటవీరేంజ్‌ల పరిధిలో మూడు రోజుల పాటు పర్యటించారు. ఆయా ప్రాంతాలలోని గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు, వేసవిలో నీటి ఇబ్బంది రాకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్లగ్ మార్కులు గుర్తించే విధానం, తదితర అంశాలను పరిశీలించారు. రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, లక్ష్మీనారాయణ వారికి ఇక్కడి విశేషాలను, స్మగ్లింగ్ నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అడవిలో అభివృద్ధి గురించి వివరించారు. రోజుకు 7 కిలోమీటర్ల దూరం అడవిలో ట్రెక్కింగ్ చేశారు. రాత్రి పూట తపాలాపూర్ చెక్‌పోస్టు వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. డివిజన్ కేంద్రంలో డాగ్‌స్క్వాడ్ గురించి, చీతా డాగ్‌స్క్వాడ్ ద్వారా నేరస్తులను పట్టుకున్న విధానం డాగ్‌స్క్వాడ్ బీట్ అధికారి శ్రీనివాస్ వారికి వివరించారు. దూలపెల్లి అకాడమీ నుంచి తిప్పేశ్వర్, ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాలలో పర్యటించి ఈ నెల 26న జన్నారం చేరుకున్నారు. మూడురోజులు అడవిలో పర్యటించామని, శుక్రవారం దూలపెల్లి వెళ్తామని టూర్ ఆఫీసర్ పద్మ తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలకరించిన 'సాక్షి'తో పలువురు బీట్ అధికారులు తమ అనుభవాలను పంచుకున్నారు.

అనేక విషయాలు తెలుసుకున్నాం



శిక్షణలో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌కు వచ్చాం. రెండు రోజుల్లో ఇక్కడ అనేక విషయాలు తెలుసుకున్నాం. తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని తపాలాపూర్ చెక్‌పోస్టు వద్ద రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాం. స్మగ్లింగ్ నిరోధంపై తీసుకుంటున్న చర్యలపై ఇక్కడి అధికారుల ద్వారా తెలుసుకున్నా.

– బీ.శేఖర్, ఎఫ్‌బీవో, కామారెడ్డి డివిజన్

చాలా ఆనందంగా ఉంది



శిక్షణలో భాగంగా ప్రత్యక్ష పద్ధతుల ద్వారా నేర్చుకునేందుకు జన్నారం అటవీ డివిజన్‌కు వచ్చాం. రెండు రోజులు ఇక్కడే బస చేశాం. రోజూ ఉదయాన్నే ఏడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేశాం. అడవిలో జరుగుతున్న అభివృద్ధి, అడవుల రక్షణ, జంతువుల ప్లగ్ మార్కింగ్‌లను పరిశీలించాం. నేరుగా అనేక వన్యప్రాణులను చూశాం. చాలా ఆనందంగా ఉంది.

– బీ.రవి, ఎఫ్‌బీవో, కొత్తగూడెం డివిజన్

ఇక్కడి విషయాలు వివరించాం



శిక్షణలో భాగంగా దూలపెల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి 49 మంది శిక్షణ బీట్ అధికారులు ఇక్కడి విషయాలు తెలుసుకునేందుకు వచ్చారు. ఇక్కడ మేము చేపడుతున్న చర్యలు, అభివృద్ధి, అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు, తదితర అంశాల గురించి వారికి వివరించాం. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాం.

– హఫీజొద్దీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

సీఎండీని కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేర్చాలని, కోలిండియా మాదిరి పెర్క్స్‌పై ఆదాయపన్ను కంపెనీ భరించాలని, సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

సీఎండీతో బేటీ అనంతరం ఐఎన్టీయూసీ నాయకులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో బేటీ అయ్యారు. సింగరేణి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



కూల్చివేయిస్తున్న డీటీఎఫ్ టీం సభ్యులు

నస్పూర్: పట్టణ పరిధిలో వెలిసిన అక్రమ కట్టడాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రవికుమార్, టీపీఎస్ ఆర్.సతీష్‌ల ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో గురువారం కూల్చివేయించారు. నస్పూర్ శివారు సర్వే నంబర్ 24లో సెట్ బ్యాక్ లేని కారణంగా నాలుగు ఇంటి నిర్మాణాల పిల్లర్లను, సర్వే నంబర్ 42లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని, సర్వే నంబర్ 11లో అనమతి లేని వెంచర్ హద్దురాళ్లను, శ్రీరాంపూర్ ఏరియా కొత్తరోడ్డులో వెలసిన రెండు షెడ్లను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోడ గడియారాలు, మద్యం స్వాధీనం



పట్టుకున్న మద్యం, గోడ గడియారాలు

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని సీఈఆర్ క్లబ్ సమీపంలో ఉన్న సీ–13 క్వార్టర్‌లో ఎన్నికల ఎఫ్ఎస్టీ మున్సిపల్ ఏఈ అచ్యుత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో 32 గోడ గడియారాలు, 130 రాయల్ స్టాగ్ క్వాటర్ బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, గోడ గడియారాలు నిల్వచేశారని తమకు అందిన సమాచారం మేరకు బెల్లం అశోక్ ఇంట్లో దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ ముస్తాఫా ఇంట్లో దాడి చేసి 75 బాటిళ్ల మద్యం పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మందమర్రిలోని పలువురి బీఆర్ఎస్ నాయకులు ఎవరింట్లో ఎన్ని బాటిళ్లు అన్‌లోడ్ చేశారనే వివరాలతో కూడిన కాగితం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు పోలీసులకు వాట్సాప్ చేసినట్లు సమాచారం.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



కేకే–5గనిపై సింగరేణి డైరెక్టర్

మందమర్రిరూరల్(చెన్నూర్): కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మందమర్రి ఏరియా జీఎం మనోహర్‌తో కలిసి కేకే–5 గనిలో దిగి పని ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం కేకే ఓసీ గనిని సందర్శించారు. ఆయన వెంట కేకే–5 గని మేనేజర్ అల్లావుద్దీన్, కేకే–ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రీజనల్ న్యూస్ యూనిట్, దూరదర్శన్ కేంద్ర స్ట్రింగర్ల ఎంప్యానల్‌మెంట్ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎస్‌యూ హెడ్ సంయుక్త సంచాలకులు (వార్తలు) రాహుల్ గొలీకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులకు ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకోసం ఆన్‌లైన్‌లో www.prasarbharati.gov.in/pbvacancies వెబ్‌సైట్‌లోసంప్రదించాలనిసూచించారు.

మాల మహానాడు కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రం అందిస్తున్న లక్ష్మణ్

పాతమంచిర్యాల: మాల మహానాడు కార్యవర్గాన్ని గురువారం జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ సమక్షంలో ఎన్నుకున్నారు. మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడిగా గరిసే స్వామి, పట్టణ ఉపాధ్యక్షుడిగా నీరటి నర్సయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జై భీం సైనిక్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్తెపు శంకర్, ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా అశ్విన్‌రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న అశ్విన్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: భారతీయ జనతా యువమోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా బొలిశెట్టి అశ్విన్‌రెడ్డిని నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి గురువారం నియామక పత్రం అందజేశారు. అశ్విన్ రెడ్డి గతంలో ఏబీవీపీ జోనల్ ఇన్‌చార్జిగా, నగర కార్యదర్శిగా, జిల్లా కోకన్వీనర్, కన్వీనర్‌గా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.

'ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి'

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కార్మికులకు కేటగిరీ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కే.వీరభద్రయ్య ముస్కె సమ్మయ్య, ఎస్కె బాజీసైదా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2022–23 సంవత్సరానికి సంబంధించిన క్యాటగిరీ ప్రమోషన్లు 2023 సెప్టెంబర్ నాటికి ఇవ్వాల్సి ఉండగా యాజమాన్యం ఇప్పటికీ ఇవ్వడం లేదన్నారు. ఫలితంగా కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రమోషన్లు ఇవ్వాలని, లేనియెడల యూనియన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బీపీఏలో పర్యటించిన డైరెక్టర్



క్వారీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వరరెడ్డి గురువారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. కైరిగూడ ఓసీపీని సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఓసీపీ పరిసరాల్లో చేపడుతున్న సివిల్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఎండల తీవ్రత అధికమవుతున్న తరుణంలో ఉపశమన చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం రవిప్రసాద్, పీవో సత్యనారాయణ, ఏజీఎం తిరుమల్‌రావు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు



శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాకు చెందిన ఐఎన్టీయూసీ నాయకులు గురువారం ఏరియా ఫార్మెషన్ కమిటీ నాయకులు సిద్దంశెట్టి రాజమౌళి ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్‌ను హైదరాబాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి ఉద్యోగుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి, ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, నాయకులు సంగెం ప్రకాష్‌రావు, రామారావు, శ్రీనివాస్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుల మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



పవన్ (ఫైల్)



సాయిచరణ్ (ఫైల్)

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌లో విషాదం

ఉట్నూర్‌రూరల్/లింగాపూర్: ఉట్నూర్ మండలం పెర్కగూడ సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న ఘటనలో కుమురంభీం జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రులు ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి బుధవారం రాత్రి జాదవ్ సాయిచరణ్(19), కొదురుపాక పవన్ (18) మృతి చెందారు. సాయికుమార్ చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.

లింగాపూర్‌లో విషాదఛాయలు...

శుభకార్యానికి వచ్చి తిరిగి లింగాపూర్‌కు వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాయిచరణ్, కొదురుపాక పవన్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. జాదవ్ రమేశ్–విజయ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు జాదవ్ సాయిచరణ్ ఢిల్లీలో జేఈఈ కోచింగ్ తీసుకుని పరీక్షలో పాసై వారం కిందటే ఇంటికి వచ్చాడు. రాయమల్లు–లావణ్య దంపతుల రెండో కుమారుడు కొదురుపాక పవన్ కుమార్ ఇంటర్మీడియట్ చదివి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శుభకార్యానికి వచ్చి వెళ్తూ ఈ ప్రమాదానికి గురై మృతి చెందడంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

పశువుల వాహనం ఢీకొని ఒకరు మృతి



ప్రభాకర్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): పశువులు తరలిస్తున్న ఐచర్ వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఇంద్రానగర్‌కు చెందిన కార్పెంటర్ జంబోజు ప్రభాకర్ (66) బుధవారం లక్ష్మీనగర్‌కు పనికి వెళ్లి రాత్రి ఇంటికి కాలినడకన వెళ్తుండగా పాత జీఎంఆర్ జిన్నింగ్ మిల్ సమీపంలో మహారాష్ట్ర వైపు నుంచి పశువుల లోడ్‌తో వస్తున్న ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

19 పశువులు గోశాలకు తరలింపు

వాహనాన్ని అదుపులోకి తీసుకుని అందులో ఉన్న 19 పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించారు. హైదరాబాద్‌కు చెందిన ఐచర్ డ్రైవర్ మహ్మద్ సర్దార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతులకు సత్కారం



రైతును సన్మానిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: జగిత్యాలలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘంలో ఉమ్మడి జిల్లా రైతులకు గురువారం సత్కారం జరిగినట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ తెలిపారు. సేంద్రియ పద్ధతిలో వరి, పెసర, మినుము పంటలు సాగుచేస్తూ నూతన రకాలకు ప్రాచుర్యం కల్పించడంలో ప్రత్యేక కృషి చేసినందుకు కాసిపేట మండలం సండ్రోనిపల్లికి చెందిన రైతు పెంటయ్యను, కృషి విజ్ఞాన శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ సాగులో అధిక దిగుబడులు సాధించినందుకు కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్‌కు చెందిన వడాయి శంకర్‌ను విశ్వవిద్యాలయం అధికారులు శాలువా, మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పీజేటీఎస్ఏయూ రిజిస్ట్రార్ వెంకటరమణ, పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు సుధారాణి, సహ పరిశోధన సంచాలకులు శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

నస్పూర్: చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ మంచిర్యాల మొదటి అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఉష నిషధ్వని గురువారం తీర్పునిచ్చారు. పట్టణ పరిధిలోని తీగల్ పహాడ్‌కు చెందిన రాజవరపు వెంకటేశ్వర్లు సీసీసీలోని ప్రశాంత్ నగర్‌లోని ఓ ఇంట్లో 2023 మార్చిలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంచిర్యాల కోర్టులో పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాహెన్ సుల్తానా సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.